క్లుప్తంగా

తాగునీటి కుళాయి ప్రారంభం



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: పట్టణంలోని కొత్తవలస గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిని ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం ప్రారంభించారు. గ్రామ శివారు కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇటీవల గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. ఆయన వెంటనే స్పందించి మున్సిపాలిటీ నుంచి నిధులు కేటాయించారు. ఆ నిధులతో తాగునీటి కుళాయి ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్ కుమార్, కొయ్యాన సత్యం, బగ్గు హరి, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ బొల్లా లలితకుమారి, కోల రమ్య, అల్లెన జయలక్ష్మి, యందవ సుశీల, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



పాఠశాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఎంఈఓ జె.త్రినాథరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలుతీరును పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించడం, ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషిచేస్తోందని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిందన్నారు. విద్యార్థులకు మంచి భోజనం, పాఠ్య పుస్తకాలు అందిస్తోందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సేవలకు సత్కారం



ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావును సత్కరిస్తున్న ఎంఈఓలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావును, రొంపల్లి క్లస్టర్ సీఆర్‌టీగా పనిచేసి బదిలీపై వెళ్లిన కె.చిన్నమ్మలను ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య బుధవారం సత్కరించారు. విధి నిర్వహణలో భాగంగా వారు అందించిన సేవలను గుర్తించి సత్కరించారు. భవిష్యత్‌లో కూడా మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కొట్టక్కి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు, సీఆర్టీలు బొప్పే సురేష్ కుమార్, ఎం.రవికుమార్, శ్రీనివాసరావు, వెంకటేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై నిఘా



రేగిడి: బూరాడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రేగిడి, రాజాం సిటీ: గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల తరలింపుపై అధికారులు ప్రత్యేక నిఘా వేశారు. మండలంలోని పారంపేట గ్రామానికి చెందిన ఓ విద్యార్థి గంజాయి తరలిస్తూ పట్టుబడిన విషయం విధితమే. అప్రమత్తమైన పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఎస్‌ఈబీ ఎస్పీ అస్మా ఫర్హీన్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం బూరాడ, కొత్తపేట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఈబీ ఎస్సై పిచ్చేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ లైబ్రేరియన్‌గా ఎంపిక



అవార్డు అందుకుంటున్న దోల శ్రీదేవి

సంతకవిటి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తున్న దోల శ్రీదేవి ఉత్తమ లైబ్రేరియన్‌గా ఎంపికయ్యారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు.

మాతృభూమికి వందనం

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆజాదీకా అమృత్ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి వారం రోజుల పాటు అన్ని పంచాయతీల్లో 'మేరీ మాటీ-మేరా దేశ్(నా భూమి-నా దేశం) పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. తొలిరోజు పలు గ్రామాల్లోని సచివాలయాల వద్ద శిలాఫలకాల ఆవిష్కరణ, మొక్కలు నాటడం, అమరవీరుల త్యాగాలను స్మరించుకుని వారికి నివాళి అర్పించడం, వంటి కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

– సాక్షి బొబ్బిలి, రాజాం



బాడంగి: నామట్టి-నాదేశం బ్యానర్లతో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ భోగి గౌరి, ఎంపీడీఓ ఆంజనేయులు, ఉపాధిహామీ సిబ్బంది



బొబ్బిలి: రాముడువలసలో 'నా మట్టి- నా దేశం' శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీడీఓ పి.రవికుమార్, గ్రామస్తులు



రాజాం: బొద్దాం జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణంలో మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, అధికారులు



వంగర: శివ్వాంలో గ్రామస్తులతో 'నా భూమి-నా దేశం' ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ బి.సత్యం నాయుడు, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు

గడువులోగా ఓటరు సర్వే పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శేషశైలజ

బాడంగి: మండలంలో చేపట్టిన డోర్-టు-డోర్ ఓటరు సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ రఫీజాన్ అధ్యక్షతన బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించడంతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులు, అభ్యంతరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి కచ్చితత్వంతో ఓటర్ల జాబితాను రూపొందించాలన్నారు. ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లంతా ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలో ఇప్పటివరకు 62 శాతం మేర సర్వే పూర్తయిందని, ఈ నెల 21లోగా సర్వేని పూర్తిచేయాలని తహసీల్దార్ అజు రఫీజాన్ బీఎల్‌ఓలను ఆదేశించారు. సమావేశంలో హెచ్‌డీటీ చిన్నం నాయుడు, ఎంఆర్ఐ సోమన్నదొర పాల్గొన్నారు.

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలో ఇంటింట ఓటరు సర్వేను వేగవంతం చేయాలని, ఈనెల 21 నాటికి సర్వే పూర్తిచేయాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశమై సర్వే నిర్వహణపై పలు సూచనలు చేశారు.

అయ్యప్పస్వామికి అభిషేకం



రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులంతా ఈ అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రేజేటి సత్తిబాబు శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతిభకు ప్రోత్సాహం

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అక్షరయజ్ఞ ఫౌండేషన్ అధ్యక్షుడు పీఎస్ఎన్ గుప్త బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మున్సిపాలిటీ పరిధి డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభకనబరిచిన వి.వాసుదేవరావుకు గోల్డ్‌మెడల్, పి.తేజేశ్వరి, ఐ.శివసాత్విక్‌లకు సిల్వర్ మెడల్స్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు కృషిచేయాలని సూచించారు. పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆర్‌వీజీఎస్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

రాజాం: పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించేదిశగా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లు, ప్లాన్ అప్రూవల్, జగనన్న కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల పురోగతిపై ఆరాతీశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నాగరాజు, ఆర్ఐలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ వినియోగంతో సాగుఖర్చు ఆదా



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేగిడి: రైతులు డ్రమ్‌సీడర్ సాయంతో వరినాట్లు వేసినట్లయితే సాగుఖర్చు తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉంగరాడ గ్రామంలో డ్రమ్‌సీడర్ వినియోగంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. గులివిందల సూర్యనారాయణ అనే రైతుకు చెందిన ఆరు ఎకరాల్లో డ్రమ్‌సీడర్ సాయంతో వరినాట్లు వేశారు. ఈ విధానంలో వరినాట్లు వేయడం ద్వారా మొక్కకు మొక్కకు మధ్య సమదూరం ఉంటుందని, మొక్క మొదుళ్లకు గాలి, వెలుతురు పుష్కలంగా తగలడం ద్వారా పిలకలు వేసి మొక్క దుబ్బుకడుతుందన్నారు. దిగుబడి పెరిగి ఆదాయం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ రేఖ, యూనిట్ ఇన్‌చార్జ్ పార్వతమ్మ, రెడ్డీస్ ఫౌండర్ సీఎఫ్ శరత్‌కుమార్, ఐసీఆర్‌పీ రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

భూసర్వే వేగవంతం



సర్వే రాళ్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ అప్పారావు

వంగర: గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని చీపురుపల్లి ఆర్డీఓ ఎం.అప్పారావు అన్నారు. మండలంలోని బాగెంపేటలో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. మండలంలో 13 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లో సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ డి.ఐజాక్, మండల సర్వేయర్ వై.అప్పలనాయుడు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తంగా...

జగన్నాథపురంలో ఫీవర్ సర్వే



ఫీవర్ సర్వే చేస్తున్న సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురంలో జరుగుతున్న ఫీవర్ సర్వేలో జిల్లా కేంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, బీపీ, సుగర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పక్కి పీహెచ్‌సీ వైద్యురాలు లక్ష్మి, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు



విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది బుధవారం రక్తపరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 251 మంది విద్యార్థులకు హిమోగ్లోబిన్ టెస్ట్ చేశారు. పలువురు విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి మందులు అందించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ, ఏఎన్‌ఎం బి.విశాలాక్షి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

14న వాహనాల వేలం

రాజాం సిటీ: స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయం ఆవరణలో ఈనెల 14న వాహనాల వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ ఎస్సై పిచ్చేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సారా కేసులో సీజ్ చేసిన ఒక ఆటో, ఒక ద్విచక్ర వాహనాన్ని వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఐదు నామినేషన్ల స్వీకరణ



నామినేషన్ స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి

వంగర: మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల ఉప ఎన్నికకు సంబంధించి బుధవారం ఐదు నామినేషన్లు అందినట్లు ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచ్ స్థానాలకు ఓనె అగ్రహారం నుంచి ఒకటి, లక్ష్మిపేట నుంచి ఒక నామినేషన్ అందాయన్నారు. వార్డు మెంబర్లకు సంబంధించి రుషింగి, ఇరువాడ, కొట్టిశ గ్రామాల నుంచి ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు అందినట్లు తెలిపారు.

గ్రావెల్ రోడ్డు పనుల పరిశీలన



గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ డీటీవీ కృష్ణారావు

రాజాం: పట్టణంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు నిర్మించిన గ్రావెల్ రహదారిని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు బుధవారం పరిశీలించారు. రూ.60 వేలతో ఈ రహదారి నిర్మించినట్లు చెప్పారు. ఐటీఐ కళాశాల విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అంగన్‌వాడీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఏఈ పి.వెంకట్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ భాష్కరరావు ఉన్నారు.

లక్ష్యాలు అధిగమించాలి



సమీక్షిస్తున్న ఏపీ చిరంజీవి

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు, మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రుణ లక్ష్యాలు పూర్తి చేయాలని సీసీలకు, సీఎఫ్‌లకు వైకేపీ ఏపీ ఎ.చిరంజీవి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సీసీలు, వీఓఏలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. స్త్రీనిధి, ఎస్‌వీఈపీ, పీఎంఈజీపీ తదితర రుణాల మంజూరుపై ఆరా తీశారు.

ముళ్లపొదల తొలగింపు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస



రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

గ్రామానికి చెందిన యువత రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను బుధవారం తొలగించారు. డొంకలమిల్లు నుంచి గ్రామం వరకు కిలోమీటరు మేర రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పేరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులపాటు సుమారు రూ.30 వేలు సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు చెప్పారు. అధికారులు చేయాల్సిన పనులను యువకులు చేయడంతో గ్రామస్తులు వారిని అభినందించారు.

మణిపూర్‌లో అల్లర్లపై బీజేపీ డ్రామాలు



మాట్లాడుతున్న కె.విజయగౌరి

బొబ్బిలి: మణిపూర్ హింసపై కేంద్రంలో, ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రపంచానికి కపట నాటకాలను పరిచయం చేస్తోందని మైనార్టీ సంఘాల నాయకులు, అఖిలపక్ష నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తాండ్రపాపారాయ జంక్షన్ వద్ద బహిరంగ సభలో వారు మాట్లాడుతూ.. మణిపూల్ అల్లర్లను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, హాజీ భాషా, జాఫర్, అదృష్ట కుమార్, ప్రవీణ్, కామేశ్వరరావు, జయరాజ్, కె.విజయగౌరీ, తమ్మినేని సూర్యనారాయణ, పి.శంకరరావు, ముప్వల శ్రీనివాసరావు, మునకాల శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

• ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి : పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని కొర్లవలస గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో ఒక్కో కుటుంబానికి అందించిన సంక్షేమ లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్లు అందజేశారు. గత ప్రభుత్వాలకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా బలోపేతం అయ్యారని, ప్రతీ ఇంట్లో లబ్ధిదారులు ఉన్నారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయనన్ని సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ప్రజలకు వివరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించేదని, నీరు-చెట్టు నిధులతో రాష్ట్ర ఖజానా కాజేసిందని ఆరోపించారు. టీడీపీకి మళ్లీ అవకాశం ఇస్తే ఈ సంక్షేమ పథకాలన్నీ కనుమరుగవుతాయన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండి, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, సర్పంచ్ బంకి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు బంకి హరనాథరావు, మాజీ సర్పంచ్ బంకి నారన్నాయుడు, సచివాలయాల కన్వీనర్ పాలవలస రామచంద్రనాయుడు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు లోచర్లలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామంలో గురువారం సాయంత్రం 4గంటల నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో పాటు బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎస్.బాబ్జీరావు, ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ లూర్దు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు బొడ్డవలసలో..

రేగిడి: మండలంలోని సంకిలి పంచాయతీకి అనుబంధంగా ఉన్న బొడ్డవలస గ్రామంలో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ బుడుమూరి పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ హాజరు కానున్నారని తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

వసతి గృహాల్లో చేరిన విద్యార్థులకూ అమ్మఒడి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ డీవీ సత్యనారాయణ

రామభద్రపురం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చేరిన విద్యార్థులకూ ప్రభుత్వం అమ్మఒడి పథకం మంజూరు చేస్తోందని ఏఎస్‌డబ్ల్యూఓ డీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక సాంఘిక బాలుర వసతి గృహాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహం ఆవరణం, మరుగుదొడ్లు, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో 5 ప్రీమెట్రిక్, 4 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయని, వాటిలో 20 నుంచి 30 వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కాస్మోటిక్ చార్జీలను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతీరోజూ నాణ్యమైన భోజనంతో పాటు సాయంత్రం స్నాక్స్ కింద వివిధ రకాల తినిబండారాలు అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

పూరిల్లు దగ్ధం



ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన ఇల్లు

సంతకవిటి: మండలంలోని కొండగూడెం గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన అలజంగి పారయ్యకు చెందిన ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రాజాం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకునే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంట్లో సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతవ్వడంతో బాధితులు రోధిస్తున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు నిలువనీడ లేకుండా పోయిందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలపరిశీలన చేస్తున్న తహసీల్దార్, తదితరులు

రేగిడి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటోందని తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి అన్నారు. చాటాయివలస గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరైందన్నారు. భవన నిర్మాణానికి అవసరమైన స్థల పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన వంక పాపారావు భూమార్పిడి విధానం ద్వారా 3 సెంట్ల స్థలాన్ని ఇచ్చేందుకు ముందుకొచ్చారన్నారు. సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, సూపర్‌వైజర్ సీహెచ్.నూకాలమ్మ తదితరులు ఉన్నారు.

బహుళ పంటల సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుపై మెంటార్ రామకృష్ణ బుధవారం అవగాహన కల్పించారు. ఈ విధనంలో 365 రోజులపాటు రైతులకు ఆదాయం వచ్చేలా వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చన్నారు. 20 సెంట్ల విస్తీర్ణంలో బహుళ పంటలు సాగుచేయడం ద్వారా నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం ఏవిధంగా పొందవచ్చో వివరించారు. ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్, వంగ, మిరప, టమోటా, ఆకుకూరలు, జొన్న తదితర పంటలు ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు

రేగిడి: ఖరీఫ్ సాగుచేస్తున్న ప్రతీ రైతు తమ పంటను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ అన్నారు. వండానపేట, గుళ్లపాడు, అంబఖండి గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును బుధవారం పరిశీలించారు. ఈ-క్రాప్ చేయించుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలకు నష్టం జరిగితే నష్టపరిహారం వర్తిస్తుందన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

తెర్లాం: ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్డీ రాంబాబు ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. చీకటిపేట, ఎస్.బూర్జవలస గ్రామాల్లో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో పూడికలు తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎం.పార్వతి, నీలమ్మ పనులను పర్యవేక్షించారు.